# వెడ్డింగ్ ఇన్విటేషన్

డా. వంశీధర్ రెడ్డి



**కథ:** వెడ్డింగ్ ఇన్విటేషన్

**రచన:** డా. వంశీధర్ రెడ్డి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఏప్రిల్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2284

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

7th September.. మధ్యాహ్నం..

ఛ ఎవడన్నాడోగానీ ఇల్లుకట్టడమే ఈజీ పెళ్ళి చేసుకోడంకంటే, అందర్నీ పిలిచానో లేదో అనుమానం, రావాల్సినవాళ్ళు రారేమో అని అనుమానం, అది బాలేదు, ఇది సరిగా కుదర్లేదని కామెంట్లేసే నాకొడుకులెలాగూ ఉంటారు..

టైముకీనా కొడుకు అరుణ్గాడు కూడా లేడు..

(( ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్.. ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్..))

ఎవడో ఫోన్.. వాడే.. దరిద్రుడు

ఫోన్రింగ్టోనెంత బావుంటదో ఇది, పాత సిన్మాల్లో ట్రంకాల్ చేసేప్పట్లాగే, కొన్ని పాతవెప్పుడూ బావుంటాయ్, పాత ఫోటో, పాత పుస్తకం, పాత వైన్..

“అరుణ్గా.. బతికే ఉన్నావా, ఎక్కడున్నావసలు, డిల్లీనుండి అతుల్, వసిష్ట్ వొచ్చారు. పెళ్ళి కార్డ్స్ ఇచ్చిరమ్మని పంపితే వారంరోజులేం చేస్తున్నావ్రా వైజాగ్లో.. ఎల్లుండేరా నా పెళ్ళి.. వొచ్చే ఆలోచనుందా లేదా”

“హ హ హ హ”

“నిన్నే బే హౌలే, కాసేపట్లో షామీర్పేట్ ‘ఆరెంజ్ బౌల్’ కెళ్తున్నారు మనోళ్ళంతా”

“ఎందుక్రా.. పెళ్ళి వెన్యూ ఏమైనా మార్చారా.. హ హ”

“తిక్కనాదూబే, బాచిలర్పార్టీకి, నువ్వక్కడుంటే ఇక్కడెవడు చూసుకుంటాడు బే”

“రేయ్ రేయ్.. చిన్నా.. కూల్ కూల్.. అతుల్ గాడ్తో మాట్లాడాను, బాంబేనుండి పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్ సాయా మేడం వొస్తున్నారు ఈవెనింగ్ ఫ్లైట్ కి, ఆరెంజ్ బౌల్ పనంతా వేణుగాడు చూసుకుంటాడు, యూ డోంట్ నీడ్ టు వర్రీ, ఫర్గాట్ టు టెల్ యూ, ఇక్కడ వైజాగ్లో చిన్న ల్యాండ్ ప్రాబ్లం, M.P భరద్వాజ్ గారిది, యారాడ బీచ్ దగ్గర అగ్రిగోల్డ్ రిసార్ట్స్ పక్కన ఓ వెంచర్ చేస్తున్నారు, దానికి రేపు క్లియరెన్స్ పనుంది, ఇక్కడి లోకల్ లీడర్లతో పర్సెంటేజ్ తెగట్లే, ఆయన్నింకోసారి కలిసి ఒప్పించి ల్యాండ్ వర్కంతా చేసుకునొస్తా. 9th మార్ణింగ్ వరకు హైద్రాబాద్ లో ఉంటా, హా.. హా.. కార్డ్స్ అన్నీ పంచేసా్రా, సార్ డిల్లీలో ఉన్నారు, అదే పార్టిషన్ గురించేదో

ఆజిటేషన్ చేస్తున్నారుగా, లేపోతే ఆయనే చూస్కునేవారిదంతా, యూ డోంట్ వర్రీ హొస్తా, ప్రీతిని అడిగానన్చెప్పు, వీలైతే నేనే మాట్లాడ్తా, పెళ్ళిరోజు నీకో మాంచి సర్ప్రయిజ్ ఉందిరోయ్"

"ఉమ్మ్, సర్లే, రాజుగాడికోసారి ఫోనివ్వు, మాట్లాడాలి.. నువ్వసలే తిక్కనాకొడుకువి, తాగి డ్రైవ్ చేస్తావ్"

"హ హ హ హ.. ఒక్కడ్నే వొచ్చారా, విజయవాడలో సంతకం పెట్టాల్సిన ఫైలొకటుండింది, అది చూసుకుని.. లంబా సఫర్"

"పూజితా.. తనింకా టచ్లో ఉందాబే ఛూతే, కొడకా, సంవత్సరంకింద వరంగల్ సిటీ గ్రాండ్ హోటల్రూంలో నువ్ చేసిన చెత్తకి తను మళ్లీ చూడదనుకున్నా.. సచ్ ఎ స్లట్ యూ ఆర్, నిండిన కండోమ్లు గోడకిసిరికొట్టిన హీరోరా నువ్వు.. హ హ హ"

"ఎవడ్రా మంచోడు.. నువ్వా నేనా, లౌడాల్లొల్లి ఇదంతా"

"రేయ్.. దయ చేసి తాగి డ్రైవ్ చేయకు.. తాగితే ఇన్నోవా అక్కడే పడనూకి క్యాబ్ తీసుకొచ్చేయ్, అగేన్ ఆమ్ టెల్లింగ్ యూ, పెళ్ళిముందు పిచ్చేషాలేయకు, టెన్షన్ పెట్టకు జనాలను"

"హ హ హ.. సరే రా సరే దొబ్బకు.. 9th మార్నింగ్ వరకుంటా, ఇంక ఫోన్ పెట్టి స్పా కెళ్ళిరా పో, రోడ్నంబర్ 12 రహమత్ గాడ్తో మాట్లాడాను, అప్పాయింట్మెంటిచ్చాడు.. వెళ్ళి తోమించుకున్రా, అండ్.. నైట్ పార్టీలో అతుల్ని కలువ్, డిల్లీ పాలిటిక్సులో మంచి గ్రిప్పుంది వాడికి.. వాడి బాబు పెద్ద బిగ్షాట్.. నోయిడాలో వెంచర్ ప్లాన్చేసావ్గా.. హి మే హెల్ప్ యూ ఫర్ ష్యూర్, ఉంటా ఇక.. టేక్కేర్ డార్లింగ్.."

"రేయ్ ర్రే.. ఇడియట్.."

పెళ్ళిలా లేదిది, ఏదో డెలిగేట్ల మీటింగ్లా ఉంది, వేణుగాడెక్కడ్చచ్చాడో.. ఫోన్లొచ్చాక ఒకరికొకరు ఎదురుపడి మాట్లాడ్డం చాలా తగ్గింది,

"హెలో.. రేయ్ వేణు, సాయంత్రం మనోళ్ళొస్తున్నారు ఎయిర్ పోర్టుక్కార్ పంపించాలి, హా సాయా మేడమే, అలాగే ఆరెంజ్ బౌల్.."

"తెల్సన్నా.. అరుణన్న చెప్పిండంత, అతుల్సాబ్ వొచ్చిండంటకదా"

"హా.. ఎందుకురా అంత పర్టికులర్గా"

“హి హి హి.. ఏం లే అతుల్సాబ్ని స్పెషల్గ చూస్కోమని చెప్పిండు అరుణన్న, కోక్ తెప్పించిన.. పోర్లను కూడ మాట్లాడిన.. సాబ్ కు సౌత్ పోరీలంటే..”

“హా హా.. సర్సరే అరుణ్చెప్పాక నేన్చెప్పేదేముందిరా, చూస్కో ఎక్కడా తగ్గొద్దు మనం.. రాత్రి తొమ్మిదింటివరకొస్తా.. ఆరెంజ్ బౌల్కే.. లేద్రా ఉండనక్కడ.. అతుల్ని మనవాళ్ళందర్నీ కలిసొస్తా.. సరేనా.. రేయ్ రేయ్ మర్చిపోయా డబ్బులున్నాయా”

“హా.. అకౌంట్ల పడేశిండు అరుణన్న, ఐనా రిసార్టోడు మనోడే అన్నా, మీరేం ఫికర్ చేయకుర్రి, సుకూన్ ఉండుర్రి అంతే”

“ఓకే రా ఉంటా మరి”

బీప్.. బీప్.. బీప్..

అరుణ్గా.. ఉండార్లా నీలాంటోడొకడు, నా బిజినెస్ కోసమే అతుల్గాడ్ని ఇన్వైట్ చేసావ్ కదా, లవ్యూ మచ్చా.. మెంటల్నా కొడకా నాకే అబద్దం చెప్పావ్గా, పూజితాను తీస్కెళ్ళే ఉంటాడు కార్లో.. అదో బాకు, వీడో బోకు.

★ ★ ★

8th September.. రాత్రి.. ప్రీతి వాళ్ళింట్లో

“నమస్తే బాబూ, మీరేంటిలా.. పెళ్ళికి ముందు ఆడపెళ్ళివారింటికి..” మామగారు కాస్త వినీ విన్పించకుండా..

“అవ్నా నాకు తెలీదంకుల్, పనుండిటువైపొచ్చా, అలాగే ఓ సారి మిమ్మల్నీ చూసెళ్దామని, ఆ.. హుహ్.. ప్రీతి ఫోన్ అటెండ్ చేయట్లేదేంటి”

వీలైనంత అమాయకత్వాన్ని మొహమ్మీదికి పిలిచి, “ఓహ్, తన ఫోన్ బానే ఉందే, పైన గెస్ట్ రూంలో ఉంది ఫ్రెండ్సొస్తే మాట్లాడ్తున్నట్టుంది” కుదిర్నంత మర్యాదనీ అనుమానంతో కలిపి కాబోయేమామ..

పాలరాతి మెట్లమీద పైకెక్కేప్పటికే గెస్ట్ రూంలో నవ్వుల గల గల..

ఎంతైనా అమ్మాయిలకు స్మైలింగ్ థ్రెషోల్డ్ తక్కువ.. ప్రతి పంజెంట్ జోక్ కి విరగబడి నవ్వుతారెందుకో.

“ప్రీతి.. ప్రీ.. హాయ్..”

ఆరేడుగురుండుంటారు నల్సార్ లా కాలేజ్ బ్యాచ్.. సగమ్మంది నార్త్ ఇండియన్ ముఖాలే, ముఖంచూసి ఏ ప్రాంతమో ఎలా తెలుస్తుంది, తమిల్ ముఖాలైతే చూడగానే తెలుస్తాయ్లే.

“హాయ్ శశాంక్, ప్లీజ్ కమిన్.. లెట్మీ ఇంట్రడ్యూస్ మై పాల్స్ టు యూ.. గాల్స్, యు మైట్ బి నోయింగ్ హిం.. హ హ.. మై వుడ్ బి..”

పరిచయాలూ పేర్ల మార్పిడులూ అయ్యాక నా ఇబ్బందిన్చూసి కాస్త ఇబ్బంది పడ్డాట్టున్నారు బాల్కనీలోకి జారింది గుంపంతా.

“శశ్, ఈజ్ ఎవ్రీథింగ్ ఓకే, ఓ ఫోన్ చెయ్యాల్సిందిగా వొచ్చేముందు..”

“అంతా ఓకే, పక్క కాలనీలో సైట్ డెవలప్మెంట్ కి తీసుకున్నాం, అక్కడికొచ్చా పన్లోపని నిన్నూ చూసినట్టుంటుందని. ఇక్కడిదాకా వొచ్చాక ఫోనెందుకులే అన్పించి”

అబద్ధం చెప్పలేనివాడు నిజం కూడా చెప్పలేడెప్పుడూ..

“ఆహా ఆహా.. అవునా ఇప్పుడు నిజం చెప్పు”

ఎలా కనిపెట్టేస్తార్రా బాబూ వీళ్ళసలు, లేపోతే నాకే అబద్ధాల్చెప్పడం రాదా?

“ఉమ్ మ్ మ్, చూడాలన్పిమ్చింది అంతే”

వారినీ నేనింత గోముగా మాట్లాడగల్నా అని అప్పుడప్పుడు నేనే షాక్.

((ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్..ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్))

క్లైమాక్స్ లో కరెంట్ పోయినట్టు ఈ టైమ్లో ఫోనెవడు, అన్నోన్ నెంబర్, ఈ సైట్ ఇంజనీర్ గాళ్ళకి పర్సనల్ నంబరివ్వొద్దందుకే..

“చూడాలన్పించిందా.. ఎందుకలా.. కమాన్ చెప్పు”

సన్నగా మంచు కురుస్తున్నట్టు సువాసన్ల మాటల్నొదిలి..

లాయర్లకి అన్నీ తెల్సినా మనతోటే చెప్పిస్తారు, డాక్టర్లకేం తెలీకపోయినా ఏదోటి చెప్పి నమ్మిస్తారు.

“నథింగ్.. నిజంగా చూడాలన్పించి.. అంతే”

((ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్.. ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్))

“సీమ్స్ టు బి ఎన్ ఇంపార్టెంట్ కాల్ శశ్.. మాట్లాడు పర్లే విల్ వెయిట్”

“నో నో అదేంలే, సైట్ ఎంజనీరన్నుకుంటా.. నేన్తర్వాచ్చేసి మాట్లాడ్తాలే.. నాట్ ఎ ప్రాబ్లం”

శతాబ్దపు అత్యుత్తమ చెత్త ఆవిష్కరణ ఫోన్, ప్రైవసీ లేకుండా కలల్లోక్కూడా దూసుకొస్తుందప్పుడప్పుడూ, స్విచాఫ్ చేస్తే సరి, అర్జెంటైతే మరో నంబరుందిగా దానికి చేస్తార్లే..

“ప్రీతి ఉమ్ మ్, ఆర్యూ కంఫర్టబుల్ విత్ మలేషియా”

అర్థం కానట్టు చూసి తన్లో తనే నవ్వుకుని తలాడించి, “వై నాట్.. దట్ వుడ్ బి ఎ గుడ్ ఛాయిస్, అక్కడ ఐలాండ్స్ బావుంటాయ్ గడపడానికి.”

కొన్ని క్షణాలు మా మధ్య మౌనంగా దొర్లి వాతావరణం వేడెక్కి పెళ్ళి రేపే అని పనులు గుర్తొచ్చి పెట్రోనాస్ టవర్కీంచి గచ్చిబౌలి మలేషియా టౌన్షిప్లో పడి..

“ఆహ్ ప్రీతి హహ్ నే వెళ్తా మరి, టికెట్స్ టూ అండ్ ఫ్రో బుక్ చేస్సాను.. 11th రాత్రి ఫ్లైట్..”

“సౌండ్స్ గుడ్.. గ్రేట్.. ఆ శశ్, అరుణ్ కన్పించట్లా ఫోన్కూడా చేయలేదెందుకు, ఎక్కడున్నాడు..”

“ఓహ్ ఐ ఫర్గాట్టూ టెల్, వాడు వైజాగ్లో M.P భరద్వాజ గారి ల్యాండ్ సెటిల్మెంట్ చూసుకుని రేపుదయం వరకొస్తా అన్నాడు.. సరేనా.. బై ఫర్ నౌ.. టేక్కేర్, స్లీప్ ఎర్లీ, రేపంతా పడుకోడానికుండదు..”

ఏమైందీ దీనికి అలా సిగ్గుపడ్తుంది, ముహూర్తం రాత్రిగా.. ఓహ్..రెండో అర్థమ్మహిమా అది..

చివర్సారి గదిలోని వాసనల్నీ గుండెలోకి తీసుకుని వొదల్లేక కదల్లేక బైటికొచ్చి..

ఎంతైనా అరేంజ్ మారేజెస్లో సౌకర్యాలే వేరు..

లౌ మారెజెస్లో ఏముంది బొంగు, ఏళ్ళకేళ్ళు చూసుకున్న ముఖాలే మాట్లాడుకున్న నాలికలే వీలైనంతవరకూ గట్టు దాటిన శరీరాలే కలిసుండాలి ఎంత బోర్ కొట్టినా.. ఇందుకేనేమో లవ్ మారేజెస్సే బ్రేకుతున్నాయీ మధ్య.. అదే అరెంజ్డ్ లో, గౌరవానిగ్గౌరవమూ మర్యాదకి మర్యాదా, కానీ ఎంగేజ్మెంట్కీ పెళ్ళికీ ఆట్టే గాప్ ఉండకూడదు, ఒకరి గురించొకరికి పూర్తిగా తెలిసే ప్రమాదముంది..

పాలరాతిమెట్లు దిగుతూ అత్తయ్యకు బయల్దేరుతున్నాని చెప్పి మెయిన్డోర్ వైపు కదుల్తుండగా గెస్ట్ రూంలోంచి గట్టిగట్టిగా అరుపులూ నవ్వులూ,

ఏమై ఉంటుంది మా హనీమూన్ ప్లాను ప్రీతి ఫ్రెండ్స్ కి చెప్పుంటుందా, అమ్మయిలూ అబ్బాయిల్లాగే ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటారా ఫస్ట్ నైట్ రొమాన్సంతా, ఏమ్మాట్లాడుకుంటారో, మగవెధవలు మాట్లాడుకునేంత పచ్చిగా ఉంటాయా, మీ వాడేం చేసాడే అనడిగితే, మా వాడు కత్తి, దించేసాడంతే, అని చెప్పుకుంటారేమో..

సృష్టికార్యం గురించి మాటలైనా చేతలైనా ఊహలైనా మాంఛి ఎనెర్జీ ఇస్తాయ్లే....

డిల్లకు డిల్లకు డిల్లకు డిల్లా

★ ★ ★

## 9th September.. రాత్రి

పెళ్ళి పీటల్మీద..

@"గణానానాం స్వాహా గణపతిం శ్రీ మహాగణపతియేనమహా శ్రీ మహాసరస్వతియేనమహా" పంతులు తీస్కునే డబ్బుకి న్యాయంచేసేట్టే ఉన్నాడు.

వెండిజరీ లాల్చీ ధోవతీ, పైనో టోపీ నుదుటిమీద చిక్కిన రూపాయ్బిళ్ళంత కుంకుమ, చేతిలో వక్కల కట్టర్, చుట్టూ జనాలు ముందు ఫోటోగ్రాఫర్లవేడి ఫ్లాష్ లైట్స్..

ఇప్పటికే గంటైంది కూర్చుని..

పంతులూ ఆయనకొచ్చిన మంత్రాలవ్వే రిపీట్ చేస్తున్నాడనిపిస్తుంది..

కొత్తవి చదివినా వినిచావొచ్చు టైమ్ పాస్ కి..

అదే అగజానన పద్మార్కం.. అదే ఆయతనమాన్భవతీ..

పెళ్ళి తంతింత భయంకరంగా ఉంటుందనుకోలేదు..

ఒకే చోట కదలకుండా కూర్చుని ఫోటోలకు ఫోజిస్తూ నవ్వడం, షిట్ ఇనెవిటబుల్ సక్, నవ్వొచ్చినప్పుడు నవ్వాలి ఏడుపొస్తే ఏడవాలంతేగానీ..

నెత్తిమీద తోకున్న టోపీ కామెడీగా.. భరించాలంతే, నవ్వుకున్నా ఎన్నో పెళ్ళిల్లాలో చూసి, చక్కగా కంఫర్టబుల్గా షార్ట్స్ అండ్ టీ షర్ట్స్ మీద కూర్చోనిస్తే రోజులైనా కూర్చోచ్చుగా,, మద్యమద్యలో ఈ అమ్మలక్కల మాటలు స్లెడ్జింగో శుభాశీస్సులో విన్పించి చావట్లే..

తేలిక బట్టలేస్కున్న నాకే ఇలాఉంటే ప్రీతిని మరీ అమ్మవారిలా తయార్చేసారు.. మెళ్ళో నగలు నేలన్తాకుతున్నాయ్, మేకప్పవసరమేలేని ముఖాన్ని అడ్డమైన రంగుల్తో అలికి, తనూ నాలాగే అనుకుంటుందా, ఎప్పుడౌతుంద్రా బాబూ అని,

అందుకే తెలిసిన పంతుల్ని పిలుచుకోవాలి పెళ్ళికి,

పెళ్ళిపీటల్మీదెవరికైనా బాత్రూంకెళ్ళాల్సొస్తే..ఛ ఛ చ చ.. దరిద్రుడా అసలు భూమ్మీదెవడికీ రాని ఛండాలపైడియాలు నీకే వొస్తాయేంట్రా, నోర్మూసుక్కూర్చో ఐపోతుంది.

“శశ్.. అప్పుడే ఐపోదు ఇంకా గంట పడుద్ది”

మెల్లగా నవ్వుకుంటూ బాధగా ప్రీతి..

నేననుకున్నవన్నీ ఎలా తెలిసిపోతాయో, అందరూ నాలాగే అనుకుంటారేమో..

అంతే, వేణు గాడేంటి టెన్షన్గా తిరుగుతున్నాడు, అతుల్ గాడు లేచిపోతున్నాడెక్కడికి, ఏమైందసలుఈ నాకొడుకు అరుణ్గాడేడి, పొద్దునొస్తాననింకా..

@ “నాయనా అను, ధర్మేచ అర్ధేచ కామేచ మోక్షేచ నాతి చరితవ్యహా..”

ఏదో ఐంది మనోళ్ళంతా బైటికెళ్తున్నారు..

“వేణ్ వేణూ”

@ “శతమానం భవతిశ్శతాయుహ్ పురుశశ్శతేంద్రియే.. ప్రతిథిష్ట..”

మైక్ నా చెవిలోపెట్టి అరుస్తున్నాడు పంతులు,

“రేయ్ వేణూ!”

@“ఆగు నాయనా తంతు పూర్తవలేదింకా”

పంతుళ్ళెప్పుడూ ఇలాగే మాట్లాడ్తారా ఇలాంటప్పుడేనా,

ఏమై ఉంటుందసలు, టయానికి ఫోన్కూడా లేదు, అమ్మ తీస్కుంది,

“శశ్.. పెళ్ళిలో అందరూ తిండి గురించాలోచిస్తారు.. ఇద్దరుతప్ప.. వాళ్ళెవరో చెప్పు.. ఏమాలోచిస్తారో చెప్పు”

ఇప్పుడు దీని రొమాంటిక్ పహేలీలు అవసరమా,

అసలేమై ఉంటుంది.. వేణు గాడ్తో మాట్లాడాలోసారి,

“శ్యశ్ చెప్పు”

చక్కగా సాంప్రదాయకంగా తలనేలకేసి బూతుజోకేసి, నాకు తెలీదనుకుని..

ప్చ్.. అమ్మో ప్రీతీ, నేను చాలా చూసీ చేసీ ఇంక అడ్వెంచర్లకు ఓపికలేక పెళ్ళిచేసుకుంటున్నా, కాసేపాలోచించినట్టు బిల్డపిచ్చి దీనంగా మొహంపెట్టి

“ఉహూ..”

“మలేషియా.. మలేషియా..”

ఓరి దీనేషాలూ..

“హౌ రొమాంటిక్ ప్రీతి” అనో మాట విసిరేగానీ, బైటేం జరుగుతుందో తెలుసుకోవాలనుంది.. ఇప్పుడు మలేషియాలూ మట్టిగడ్డలూకూడా ఉత్సాహాన్నివ్వట్లేదెందుకో..

@ “సుముహూర్తే సావధానే.. శుభలజ్నే సావధానే.. సుముహూర్త సుముహూర్తోస్తూ.. లక్ష్మీ నారాయణే సావధానే.. గట్టి మేళం గట్టి మేళం..ఒకరికొకరు తలమీద జీలకర్రా బెల్లం పెట్టుకోండి”

షిట్ మాన్, అసలే మధ్యలో గడ్డి రాలిపోతుంది.. చుట్టూపోతే ఎడారే..

“శశ్.. వాట్యూ థింకింగ్.. ఫోటోల్తీస్తున్నారు నవ్వుస్వామీ.. పెళ్ళింకా ఐపోలేదు తాళుందింకా”

ఎలా తెలుస్తాయో ఇన్నిన్ని రహస్యాలు వీళ్ళకు..

కాసేపయ్యాక అదే అనుమానప్మోహంతో మూడుముళ్ళేసి కూర్చున్నాకా వేణుగాడి గొంతు చెవిలో, “అనా.. అద్.. అదీ”

“ఏమైంద్రా.. ఆరెంజ్ బౌల్లో ఏమైనా గొడవా”

“లేదన్నా అదీ.. అద్ ..”

“సాలే చెప్పు ఏమైందో గుల్లకు,” గొంతుదాటి పంతుల్నీ భయపెట్టి

"అరుణన్న ఇన్నోవాకు ఆక్సిడెంట్.. ఇయ్యాల పొద్దుగాల్ల వైజాగ్ KGH ల ఉందట బాడీ"

"బాడీ.. బాడీ ఏంద్రా లంజొడ్కా.. ఏమ్మాట్లాడ్తున్నవ్"

పంతులు కోపంగా.. ప్రీతి కంగారుగా నావైపే చూస్తూ వొణుకుతున్న నా చేయి పట్టుకుని..

వేణుగాడు అతుల్ని సైగ చేసి రమ్మంటుండగా..

ఏం జరిగిందోనని ఒకర్నొకరు చూసుకుంటూ అమ్మా నాన్న అత్తయ్య మామయ్య అరుణ్ వాళ్ళమ్మ, బంధువులూ..

అతుల్గాడు, "శశీ ఆమ్ సారీ టు సే, అరుణ్ మెట్ విత్ ఎన్ ఆక్సిడెంట్ దిస్ మార్నింగ్, గాట్ అడ్మిటెడ్ బట్.. ఐ హావ్ స్పోకెన్ విద్ ది హాస్పిటల్ అథారిటీస్ టూ.. సీమ్స్ టు బి బ్రెయిన్ డెడ్, యు కంప్లీట్ ది రిమైనింగ్ థింగ్స్.. వి డింట్ యెట్ టెల్ టు హిస్ మామ్, యు కంప్లీట్ రెలిజియస్ థింగ్స్.. మి అండ్ వేణు విల్ క్లెయిమ్ అరుణ్స్ బాడీ"

బాడీ.. బాడీ ఏంద్రా కొడుకుల్లారా.. వాడు వాడు.. అరుణ్గాడ్రా..

అరుణ్ బాడీ కాదు, బాడీ కాదు..

తెలీని ఆవేశం ఆవేదనా నేను లేకపోవడమంటే ఏంటో తెలిపి,

"శశ్ ప్లీజ్.. ప్లీ.. కామ్ డౌన్, లెట్స్ కంప్లీట్ దిస్ షిట్ ప్లీజ్.. అందరూ ఉన్నారు.. అరుణ్ ..అరుణ్కేం కాదు ప్లీజ్" కళ్లలో నీళ్ళింపుకుని ప్రీతి,

"చూడు ప్రీత్.. వీళ్ళు బాడీ అంటున్నారు అరుణ్ణి.. బాడీ.."

"ప్లీజ్ శశ్, పంతులు గారూ వీలైనంత తొందరగా.."

@ "హా అలాగే తల్లీ.." పంతులుగాడికేమర్థమైందో..

ఏం జరిగుంటుందసలు.. బాస్టర్డ్.. తాగొద్దు తాగొద్దని నెత్తికొట్టుకుని చెప్పా కదరా ఛ, అరుణ్ రేయ్.. ఆ టైమ్లో కార్లో ఎవరైనా ఉన్నారా అతుల్గాడ్నడగడం మర్చిపోయా..

@ "నాయనా పెళ్ళైపోయింది, అరుంధతిన్చూడ్డమొక్కటే బ్యాలెన్స్.."

"ప్రీతి.. అరుణీజ్ నో మోర్, నీకన్పిస్తుండొచ్చు, ఇప్పుడెళ్లినా చేసేదేం లేదుగా అని, బట్ నాకిక్కడ ముళ్ళమీద కూర్చున్నట్టుంది, రిలేటివ్స్ ఫ్రెండ్స్ బ్లెస్సింగ్స్ అంటావా తలమీద అక్షతల్చల్లి గ్రూప్ ఫోటో దిగితేనే దీవించినట్టు కాదు, ఆమ్ సారీ.. కానీ ఐ కుడెంట్ హెల్ప్ మైసెల్ఫ్.. ఐ హావ్

టు గో.. మామయ్యకి అత్తయ్యకి ఏం చెప్తావో ఎలా చెప్తావో.. ప్లీజ్ హెల్ప్ మి, నేనిప్పుడెవర్తోనూ మాట్లాడే స్థితిలోకూడా లేను.. వాడ్ని చూడాలంతే.. వాడు వాడు చావలేదు బ్రెయిన్ డెడ్ అంతే.. వాడికేం కాదు ఏం కాదు..”

అమ్మ.. అమ్మొస్తుంది చెప్పాలా.. ఏం చెప్పాలి.. ఏడుస్తున్నానా.. ఉహూ లేదు

ఏడవొద్దు.. ఇది పెళ్ళిమంటపం అందరూ చూస్తున్నారు.. ప్లీజ్ డోంట్ క్రై ప్లీజ్..

“మా.. అమా, ఏం కాలేదే అరుణ్గాడికి చిన్న ఆక్సిడెండ్ వైజాగ్లో, కొంచం సీరియస్సే, వెళ్ళాలి ప్లీజ్ మా.. నాన్నా వాళ్ళకి చెప్పెయ్”

((ఏం చేస్తాం అలా రాసిపెట్టుందంతే, కుఱ్ఱాడికి నిండా ముప్పయ్యేళ్ళు ఉండవ్))

ఎవరో గుంపులోంచి.. అప్పుడే అందరికీ తెలిసిపోయిందా..

ఎవడువాడు.. ఆ రాతఱ్ఱాసేదెవడూ.. హూజ్ దట్ ఫకర్, అసలు మనుషుల రాతఱ్ఱాసే అధికారం ఆనాకొడుక్కెవడిచ్చాడు, రాత.. బ్లడీ హెల్, వెళ్ళాలి వైజాక్కి.. ఇప్పుడే వెంటనే.. ఆంటీ.. అరుణ్గాడి అమ్మకి.. ఆంటీకేం చెప్పాలి.. నేనే పెళ్ళికార్డ్స్ ఇచ్చిరమ్మని చంపేసానచెప్పనా, ఏం చెప్పాలి అందరూ నన్నెందుకు వింతగా చూస్తున్నారు.. ఒక నిర్యాణంకంటే కళ్యాణమ్ముఖ్యమా..

“అతుల్ ఆమ్ కమింగ్ విత్యూ, రేయ్ వేణూ, వెహికిల్ తీసుంచు.. అలాగే ఒక జత బట్టలూ.. వొస్తున్నా”

వెళ్ళాలి అంతే.. వెళ్ళాలి.. వెళ్ళేముందు ఆంటీ కొక్క మాట

“ఆంటీ ఆం..”

ఏడుస్తున్నానెందుకు.. ఏడిస్తే గతం మారనప్పుడు ఏడుపెందుకు...

“వేణు చెప్పాడు శశీ, నాకు వాడ్తప్ప ఎవరూ లేరు, ఆయనొదిలేసెళ్ళాక ఏడ్చి ఏడ్చి ఇప్పుడేం మిగల్లేదు, నీలా ఏడవాలన్నాకూ... కానీ ఏడుపు రానందుక్కూడా ఏడవలేకుండా తయారయ్యాను, ఇలాంట్రోజొకటొస్తుందన్తెల్సుగానీ, ఇంత తొందరగా.. దయచేసి వాడ్నిక్కడికి తీసుకురాకండి నేను చూళ్ళేను.. మర్చిపోయిన ఏడుపు గుర్తొస్తుందని భయంగా ఉంది, చివర్చూపులు చూసేవాళ్ళుకూడా నాకెవరూ లేరు, వీలైతే అక్కడే ఎక్కడైనా..” మాటఱ్ఱాట్లే ఏడుపులో కలిసి..

అందరూ చూస్తున్నారు జాలిగానో కోపంగానో

"అనా గాడీ తయార్ జల్దీ రాండ్రి," వేణుగాడు ఏడుపాపుకుంటూ.

ఎందుకిలా జరిగిందసలు.. నిన్న పొద్దున నవ్వుతూ మాట్లాడినవాడు ఇప్పుడు లేడంటే ఏంటిదంతా.. లేకపోడమంటే ఏమిటసలు.. ఎక్కడికెళ్ళాడు వాడు.. ఎక్కడికెళ్ళగలడు వాడు మమ్మల్నొదిలి.. బాస్టర్డ్ రేయ్..

క్షమించమని ప్రీతినోసారి చివరి చూపు చూసి కారెక్కి నేనూ అతుల్ వసిష్ఠ్ వేణు..

★ ★ ★

హైవే మీద గంట ప్రయాణించాకా ఆకలి మొదలైంది. ఎవడున్నా ఎవడు పోయినా కడుపుమాత్రం నిండాలి, నాతోపాటు అందరిమొహాల్లో ఆకల్ని బాధతో కప్పేసుకుని,

"వేణు ఏదైనా దాబా దగ్గరాపురా తిందాం.. ఆకలేస్తుంది. అలాగే వైన్స్ కన్పిస్తే పుల్లీస్కుందామ్.. అతుల్ ఆమ్ సారీ ఫర్ వాటెవర్ హాపెండ్, యు టూ వసి.. అండ్.. థాంక్స్ ఫర్యువర్ సప్పోర్ట్"

నేనే మాట్లాడుత్తున్నానా ఏమ్మాట్లాడుత్తున్నానో,

ఎవడైనా మాట్లాడండ్రా రేయ్.. అంతా నిశ్శబ్దాన్నే నమ్ముకుని..

((ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్.. ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్..))

ఫోనెవడ్రా.. భరద్వాజ గారా.. ఈ టైమ్లో.. తెలిసినట్టుందా

"హెలో.. సార్నమస్తే"

"డిస్టర్బ్ చేస్తున్నందుకు తిట్టుకోకయ్యా శశీ, అరుణ్ ఎక్కడున్నాడు, వాడి ఫోనెందుక్కలవట్లే, వైజాగ్ ల్యాండీలింగ్ ఐదు కోట్లకు తెగిందట, ఎమ్మెల్యే చెప్పాడిందాకే"

"అవునా.. బయల్దేరా అన్నాడ్సార్, మే బి ట్రావెలింగ్లో ఉన్నట్టున్నాడు.. ఫోన్ చార్జింగ్ లేదన్నాడు, నేను చూసుకుంటాను సార్, ఎందుక్సార్.. అబ్బే వేణునిప్పుడు వైజాగ్ పంపడమెదుకూ.. ఇంకో రెండు గంటల్లో ఫోన్చేయిస్తా వాడితో.. అరుణ్తో.. సరేనా, హా.. వేణు పెళ్ళిపనుల్లో కాస్త బిజీగా ఉన్నాడు, హాయిగా రెండు పెగ్గులేస్కుని పడుకోండి, మేము చూసుకుంటాం.. ఓకే సర్ ఉంటా మరి"

నిజం దాచలేని అబద్ధాలు అవసరాల్లో భాగమై..

"వేణు ఎదురుగా వైన్స్ ముందాపు, అతుల్ వాడ్డాయా ప్రిఫర్.. టీచర్స్ చల్తా క్యా?"

"జస్ట్ గెట్ వాటెవర్యూ ఫైండ్, నీడ్ సంథింగ్ టు బర్న్ ద ట్రూత్ బ్రో.. వి ఆర్ వెరీ మచ్ డిస్టర్బ్డ్ శశీ.."

"ష్యూర్ అతుల్, వేణు ఆగరా.. వొస్తున్నా.."

మంచు తడిపిన విండోస్ ఎక్కించి కార్ దిగి డోర్ మూసి.. వైన్స్ వేపుగా...

"వేణు భరద్వాజ ఫోన్ చేశారిందాక, వినే ఉంటావ్ మాట్లాడిందంతా.. వైజాగ్ డీలింగ్లో 5 కోట్లొచ్చాయట, వాటి కోసమే అరుణ్ణెవరైనా.. ఏదైనా.. పార్టీలో అరుణ్గాడికి ఆపోనెంట్స్ ఎవరు.. భరద్వాజతో అరుణ్ బానే ఉంటాడా"

"5 కోట్లా.. నాకేం చెప్పలేదన్నా.. నార్మల్గా పైసలసంగతి సార్ నాకే చెప్తాడెప్పుడూ, ఈ సారి అరుణన్నెల్లాగూ వైజాగెల్తుండని అన్నకి చెప్పినట్టుండు"

"నిజం చెప్పురా.. రేయ్.. వేణు మన అరుణ్గాన్నెవరో కావాలనే ఇలా చేసినట్టన్పిస్తుంది, ఆ ఎమ్మెల్యే గాడెలాంటోడు.. భరద్వాజెలాంటోడ్రా.."

"అన్నా 5 కోట్లంటే అంత పెద్ద ఎమౌంట్ కాదన్నా మనకు, నేను 25 కోట్లదాకా ట్రాఫికింగ్ చేస్తా కద, పైసల కోసమే అన్ననేదో చేశే అవ్సరం ఎవర్కి లేదే, భరద్వాక సార్కు అరుణన్నంటే మస్తిష్టం, బాగా చదువుకుని పాలిటిక్స్లకొచ్చిండని, ఉషారుంటడనేటొడెప్పుడూ.. అనా.. అది ఆక్సిడెంటే, మన గాశారం గంతే, నువ్వేందేందో ఆలోచించకు"

"హా.. అవున్రా.. నేనే పిచ్చిపిచ్చిగా.. ఏదేదో ఆలోచిస్తూ.. కదా.. అది.. అది ఆక్సిడెంటేరా, నేనే, ఏం చేయాలో తెలీట్లేరా.. ఎవర్ని నమ్మాలో కూడా, అసలు.. అసలిలా ఐందని మీకెవరు చెప్పారు"

"సాయంత్రం వైజాక్కెల్లి డాక్టర్ ఫోన్చేసిండు, పొద్దున హైద్రాబాద్ హైవే మీద ఆక్సిడెంటైందట, కోమాలకు పోయిండట, సాయంత్రం మేల్కొచ్చి నా నంబరిచ్చిన జెర్సేపటికే మల్ల కోమలకు పోయిండట, తల్కాయ పల్గిందట"

"సాయిబాబా వైన్స్" ముందు ఒకడు పడి దొర్లుతూ.. గుడిశేటి పనులకూ గుడిదేవుడి ఆశీస్సులుండాలేమో..

"వేణు.. ఓ నాలుగు డిస్పోజబల్స్.. చిప్స్.. రెండు కింగ్స్ ప్యాక్ తీస్కో, నేను మందు తెస్త.."

పెళ్ళికొడుకు గెటప్లో మందడుగుతుంటే అద్భుతంలా చూస్తున్నారు జనాలు

షాపు ముందు.. వాడు కక్కిందాన్లో వాడే మునుగుతూ.. ఓ జీవి..

అరుణ్గాడూ ఇలాగే తాగి చచ్చాడు, తండ్రొదిలేసిన బ్రోకెన్ ఫ్యామిలీ నెగ్లెక్టెడ్ చైల్డ్ అరుణ్గాడు, అందరూ లంజొడకా అంటుంటే రాయై బడిలోనే బీడీ సారా అలవాట్చేసుకున్న అరుణ్గాడు.. ఇష్టంతో కాక డబ్బుమీదున్న కసితో MBA గోల్డ్ మెడల్ తెచ్చుకుని లక్షలు సంపాదించి దానం చేసిన అరుణ్గాడు, వాడికొచ్చిన సంబంధం నాకు బావుంటుందని ప్రీతిని నాకిచ్చి పెళ్ళిచేయించిన అరుణ్గాడు.. ఎవరికీ చెప్పకుండా వారం వారం విజయవాడ సానుల కొంపలో పూజిత దగ్గరికెళ్ళి ప్రేమ వెతుక్కునొచ్చే అరుణ్గాడు..

ఇవాళ ఉదయం చిట్లిపోయాడు బిందువై

హైవే మీద రోడ్ పక్కన పన్నెండుగంటల్రాత్రి కారాపుకుని.. కొన్ని ఉదయాల్ని చంకల్లో దాచుకుని మేము..

"అతుల్.. స్కాచ్ నై మిలా, అంటిక్విటీ చల్తా.."

పెగ్ ఫిక్స్ చేస్తుంటే మందుకొంచమొలికి సీట్మీద కారి..

అరుణ్గాడు లేకుండా మందు తాగడం పదేళ్ళలో తొలిసారిదే,

నా కొడకల్లారా రేయ్.. ఎవరో ఒకరు మాట్లాడండ్రా, ఇంకా ఎంతమంది చచ్చాకా మాట్లాడ్తారు, నాకు పిచ్చెక్కకముందే మాట్లాడండి..

"అతుల్, ఓ జో మేరా నోయిడా వెంచర్ కా బారేమే క్యా సోచా తూ, ఈజ్ ఇట్ ఫీజిబుల్ దేర్, ఇఫ్ ఇట్స్ ఓకే ఆమ్ రెడీ విద్ ఎ కాపిటల్ ఎమౌంట్ ఆఫ్ 100 c, రిమైనింగ్ విల్ గెట్ ఫ్రం బ్యాంక్స్ ఆజ్ యూజువల్.."

నేనేనా మాట్లాడింది, బిజినెస్ డీల్ మాట్లాడాల్సిన టైమా ఇది.. మరేం మాట్లాడ్ను, ఏం మాట్లాడినా వాడు లేకుండా ఉండట్లే, ప్రతి మాటలో వాడున్నాడు, మీకెలా అర్థమవుతుంద్రా.. నేన్చెప్పేది...

"యేహ్.. ఇట్ ఈజ్ క్వైట్ ఫీజిబుల్ దేర్, ఐ విల్ నెగోషియేట్ విత్ దెం టూ, వన్స్ ఐ గెట్ ది రెస్పాన్స్ విల్ లెట్ యూ నో.. డ్యూడ్ ఎవ్రీథింగ్ పాజిబుల్ విత్ మనీ.."

మందంటిన మీసాల్ని ఎడమచేత్తో సవరదీస్తూ అతుల్...

ఎవ్రీథింగ్ పాజిబుల్.. హహ్హ, అరుణ్గాడిని తెచ్చిస్తావారా, ఎంతంటే అంతిస్తా.. హా, ఎవ్రీథింగ్ పాజిబుల్, షిట్, ఫకింగ్ పాజిబుల్ విత్ మనీ, ఓన్లీ ఫకింగ్ పాజిబుల్ విత్ మనీ నథింగ్ ఎల్స్ ..

అమ్మావాళ్ళతో మాట్లాడాలోసారి టెన్షన్ పడ్తుంటారు,

((ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్, ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్))

ఎవరూ.. భరద్వాజా.. మళ్ళీ ఏమొచ్చింది వీడికి,

"సార్ చెప్పండి,"

"హా శశీ.. డబ్బొచ్చేసిందిలేమ్మా..నిన్న రాత్రే మా బామ్మర్ది అకౌంట్లోకి ట్రాన్స్ఫర్ చేశాట్ట అరుణ్, వాడిప్పుడే చెప్పాడు వెధవ, సర్లేమ్మా, విష్ యూ హ్యాప్పీ మ్యారీడ్ లైఫ్, పెళ్ళికి కుదర్లేదు, అరుణొచ్చాక ఇంటికొస్తా ఓరోజు, గుడ్నైట్.."

కోల్పోయాకే విలువ తెలుస్తుందని ఎన్నిసార్లు చెప్పినా.. అనుభవమైనా.. తిరిగి కోల్పోడానికే ఇష్టపడ్తాడెందుకో మనిషి.. ఉన్నప్పుడర్ధం కాలేదెప్పుడూ.. ఏ కష్టమొచ్చినా నేనున్నాలేరా అన్చెప్పినప్పుడు..

రేయ్ అరుణ్గా ఎందుకురా ఇలా, హా హ్యాప్పీ మ్యారీడ్ లైఫ్..

నాకివాళ పెళ్ళైందని మళ్ళీ ఇప్పుడే గుర్తొచ్చిందా భరద్వాజా.. అదీ నువ్ చెప్తేనే, వాడ్లేడనే నీకు చెప్పాలనిపించలేదురా, ఎందుకో మరి, వాడ్లాంటోడికి నువ్వు తగవు.. నేనూ తగను.. మనకు పనిచేసి పెట్టడానికి జెండామోస్తూ తిరగడానికీ ఒకడు కావాలి, అంతే.. వాడూ మనిషేనని వాడు చచ్చాకే ఒప్పుకుంటాం కదా.. నువ్వైనా నేనైనా ఎవడైనా..

మనిషిని మనిషిగా గుర్తించేది వాడు చచ్చాకే.. అదీ పేరులేకుండా గౌరవపూర్వకచిహ్నంగా "బాడీ" అని పిలుచుకుని..

బాడీ.. దేహము..

అరుణ్ = బాడీ + (వ్వాట్)

ఇప్పుడు వాడిలో లేనిదేది, అసలెవరికైనా చావకముందూ పోయాక లేనిదీ ఏమిటీ,

ప్రాణమా.. కాదు కాదు.. బ్రతికున్నవాళ్ళందరికీ జీవం ఉన్నట్టా...

చైతన్యమా.. మరణించాకా కూడా మన్లో చైతన్యం నింపే మనుషులెంతమందిలేరు...

మరదేంటి.. ఆ లేనిదేవిటి,

((ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్.. ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్))

భయమేస్తుందెందుకో ఫోన్ శబ్దం వింటే..

అన్నొన్ నంబర్.. ఎక్కడో చూసినట్టుందే,

"హెలో.. హెలో.. గురూ ఎలా ఉన్నావ్.."

చాలాసార్లు విన్నగొంతు

"హెల్.. హెలో పూజ్.. పూజితా"

"హమ్మయ్య బానే గుర్తుపెట్టుకున్నావే.. పెళ్ళికి కార్డ్ పంపావ్ గానీ వీలవలే"

కార్డ్.. నేనా ఓహ్ అరుణ్గాడిచ్చాడా,

"నీ తోకెక్కడా.. అవ్నూ నా ఫోన్ అటెండ్ చేయొద్దని ఏమైనా అనుకున్నారా మీరిద్దరూ, హా.. నిన్న రాత్రి నీకు నాలుగు సార్లు చేస్తే స్విచ్ ఆఫ్ చేస్కుంటావా.."

"హేయ్ ఏం కావాల్నికిపుడు"

"అరుణెక్కడ.. పార్టీ పని మీద ఢిల్లీ వెళ్తా అన్నాడు.."

"హా అవ్ను.. అక్కడే ఉన్నాడు.. పనేంటి"

"ఏంటి శశి.. ఏం తెలీనట్లు మాట్లాడ్తావ్.. అరుణ్ణీకేం చెప్పలేదా, మా పెళ్ళి.. వొచ్చే నెల్లో, కార్డ్స్ కూడా ప్రింటయ్యాయ్.. వైజాగ్ నుండి వెళ్ళేప్పుడు విజయవాడకొస్తాడేమో మొదటి కార్డ్ నీకే పంపిద్దామనుకుంటే.. ఎక్కడ చచ్చాడో మహానుభావుడు"

పెళ్ళి.. అరుణ్ పూజితతో.. ఇదేనా వాడు నాకిస్తానన్న సర్ప్రయిజ్.. ఓ గాడ్, ఏం చేయాలిప్పుడు.. వాడు లేడని తనకి చెప్తే.. వొద్దొద్దు.. తననలాగే నమ్మనీ.. మెల్లగా ఏదోరోజు చెప్తా, అంతే అంతే..

"ఏమైంది గురూ సైలెంటయ్యావ్.. సానిముండకు పెళ్ళెందుకనా"

"హేయ్ పూజా.. అలా అనకు.. నేన్నిన్నెప్పుడూ అలా చూడ్లేదు, ఇన్ఫాక్ట్ ఆమ్ సో గ్లాడ్, వాడ్నాకో షాకిస్తా అన్నాడు గానీ చచ్చేంత షాక్ అని తెలీదు"

"నిజమా.. అలా అన్నాడా.. సరే గురూ, అరుణ్కి వీల్లేపోతే నేనే హైద్రాబాదుకొస్తాలే, ఎలాగూ మీ ఆవిడ్ని చూడ్డానికి రావాలిగా హ హ.."

"తప్పకుండా పూజా.. నేన్నీతో రేపు మాట్లాడనా.. కాస్త బిజీగా ఉన్నానిప్పుడు"

"ఓకే గురూ.. ఆల్ ది బెస్ట్, ఎంజాయ్.."

కొన్ని గంటల్లో ఎక్కడ్నించెక్కడికి ..

"రేయ్ రేయ్యాలే.. వేణూ చూసుకుని డ్రైవ్ చెయ్, డివైడర్ కి తాకుతుంది బండి, తాగలేదుకదరా నువ్.. ఎక్కిందా, కాసేపాగుదామా ఎక్కడైనా.."

"రెండ్రోజులు నిద్ర లేదు కదన్నా కళ్ళు మూసుకపోతున్నయ్ అంతే, గా వాటర్ బాటిలిటియ్యిర్రి.. మీరు పండుకోర్రి నేను చూస్కుంట.."

ఆ అ అ అహ్ హ్ హ్ హ్ హ్ అ అ అ అ అ

ఆవులింతలు పాడుగానూ.. ఊపొచ్చే పాటలినాల్రాబై నిద్ర ఎగిర్పోవాలంటే.."

గబ్బర్ సింగ్ గబ్బర్ సింగ్ గబ్బర్ సింగ్ గబ్బర్ సింగ్..

పెన్ డ్రైవ్లో పాట..

ధబ్ ధబ్ ధబ్ ధబ్ ఢేళ్ ఢేళ్ ఢేళ్ ళ్ ళ్ ళ్ ళ్ ళ్ ళ్ ళ్

క్రీచ్ః చ్ః చ్ః చ్ః చ్ః చ్ః చ్ః చ్ః చ్ః చ్ః

శ్ శ్ శ్స్ హ్స్ హ్స్ శ్స్ హ్స్ శ్..

కొన్ని గంటల్లో ఎక్కడ్నించెక్కడికి..

నా తల పగిల్న శబ్దం చెవిని చేరేలోపే కళ్ళు మూసుకుపోయి..

ఇదేనా ఇదేనా మరణమంటే.. ఇదే హా ఇదే ...

దబ్ దబ్ బ్ బ్ క్రీచ్ క్రీచ్.. శ్ శ్ శ్స్ హ్స్ హ్స్ శ్స్ హ్స్ శ్..

శరీరం తేలికౌతూ రక్తం రక్తం నల్లగా.. చీకట్లో ఎవరూ కదలక అందరూ..

ఎవరూ.. నువ్వెవరు.. నేనెవరసలు.. రక్తం అంతా రక్తం..

మరణించాకా కోల్పోయేదేంటో కళ్ళ మూతలకేదో దివ్యదృష్టొచ్చి..

ఏదో తెలుస్తుంది ఏదో..

ఇన్నాళ్ళ ప్రపంచం అనుభవించిన జీవితం స్నేహాలు బంధాలు గాయాలు జ్ఞాపకాలూ అన్నీ అన్నీ.. ఎవ్రీ మదర్ఫకింగ్ థింగ్ ఒక్కోటే మాయమౌతున్నాయ్..

ఇదేనా కోల్పోడమంటే.. ఇదేనా హా.. కళ్ళ మూతలు తెర్చుకున్నాయెందుకో..

రక్తం.. రక్తం.. ఎదురుగా వొస్తున్న వెహికిల్ లైట్ల వెలుక్కి

డ్యాష్ బోర్డులోంచి బైటికొచ్చిన నా వెడ్డింగ్ ఇన్విటేషన్..

వంటేరి వారి పెళ్ళి పిలుపు.. శశాంక్ వెడ్స్ ప్రీతి..

రక్తం రక్తం రక్తం

★

For Latest Telugu Books - Visit now:
Kinige
.com